బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 17 ఏప్రిల్ 2025 www.balagamtv.com పేజీలు 4

## సుప్రీంకోర్టు తర్వాత సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. న్యాయశాఖకు జస్టిస్ గవాయ్ పేరును ప్రస్తుత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా సిఫారసు చేశారు. మే 13వ తేదీతో సీజేఐ సంజీవ్ ఖన్నా పదవీ కాలం ముగియనుంది. దీంతో 51వ సీజేఐగా జస్టిస్ గవాయ్ మే 14న బాధ్యతలు చేపడతారు. కాగా, జస్టిస్ గవాయ్ సీజేఐగా 6 నెలలు కొనసాగనున్నారు. నవంబర్‌లో ఆయన రిటైర్ కావాల్సి ఉంది. దళిత సామాజిక వర్గానికి చెందిన గవాయ్‌కు ముందు ఇదే సామాజిక వర్గానికి చెందిన జస్టిస్ కేజీ బాలకృష్ణన్ 2007లో సీజేఐగా బాధ్యతలు చేపట్టారు. మహారాష్ట్రలోని అమరావతికి చెందిన జస్టిస్ గవాయ్ 1985 న్యాయవాద వృత్తిలో చేరారు. మహారాష్ట్ర హైకోర్టు జడ్జి, మాజీ అడ్వకేట్ జనరల్ బారిస్టర్ రాజా భోంస్లేతో ఆయన పనిచేశారు. 1987 నుంచి 1990 వరకూ ముంబై హైకోర్టులో ఆయన సొంతంగా లా ప్రాక్టీస్ చేశారు. 1992లో నాగపూర్ బెంచ్ అసిస్టెంట్ గవర్నమెంట్ లాయర్‌గా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. 2003లో హైకోర్టు అడిషనల్ జడ్జిగా నియమితులై 2005లో పెర్మనెంట్ జడ్జి అయ్యారు. 2019లో ఆయన సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు.

## చెట్లు కొట్టేసే ముందు
# అనుమతులు తీసుకున్నారా..?



- లేకుంటే జైలుకే
- కంచ గచ్చిబౌలి వ్యవహారంలో స్టేటస్ కో కొనసాగింపు
- సీఈసీ రిపోర్ట్‌పై కౌంటర్ దాఖలుకు నాలుగు వారాల గడువు
- తదుపరి విచారణ మే 15కు వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టులో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. చెట్ల నరికివేతపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. చెట్లు కొట్టేసే ముందు అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయి నిలదీశారు.సీఎస్‌ను కాపాడాలని అనుకుంటే.. వంద ఎకరాలను ఎలా పునరుద్ధిస్తారో చెప్పాలన్నారు. దీనిపై నాలుగు వారాల్లో ప్రణాళిక సిద్ధం చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను మే 15వ తేదీకి వాయిదా వేశారు. అప్పటి వరకు స్టేటస్ కోను విధించారు.

కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్లు నరికేందుకు అనుమతులు తీసుకున్నారా.. లేదా.. అని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ(సీఈసీ) రిపోర్ట్ పై కౌంటర్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నాలుగు వారాల గడువు ఇచ్చింది.పర్యావరణ, జీవావరణాన్ని కాపాడేందుకు తాము అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నట్టు వెల్లడించింది. అంతకన్నా ముందు తెలంగాణ ప్రభుత్వ వైల్డ్ లైఫ్ వార్డెన్‌లు చెట్లు నరికిన ఆ 100 ఎకరాల్లో జంతువుల సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈ 100 ఎకరాల్లో అటవీ నిర్మూలన కారణంగా ప్రభావితమైన వన్య ప్రాణులను పరిశీలించి, వాటిని రక్షించడానికి అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ 100 ఎకరాల్లో పునరుద్ధరణ ఎలా చేస్తారు? ఎంత కాలంలో చేస్తారు? జంతు జలాన్ని ఎలా సంరక్షిస్తారో స్పష్టంగా చెప్పాలని తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూ వ్యవహారంలో సుమోటో కేసుతో పాటు బీ ఫర్ ది ఛేంజ్ సొసైటీ, ఇతరుల ఇంప్లీడ్ పిటిషన్లపై బుధవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సుదీర్ఘ విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ మనుసింఘ్వి, మేనక గురుస్వామి, బీ ఫర్ ది ఛేంజ్ సొసైటీ పిటిషన్ తరపున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు, పి.మోహిత్‌రావు, మరో పిటిషన్ తరపున ఎస్.నిరంజన్ రెడ్డి, భారత ప్రభుత్వం తరపున సొలిసిటర్ తుషర్ మెహతాలు వాదనలు వినిపించారు. తొలుత ప్రభుత్వం తరపు సీనియర్ అడ్వొకేట్ అభిషేక్ మను సింఘ్వి వాదనలు విని పిస్తూ... గత ఆదేశాల నేపథ్యంలో అన్ని పనులు ఆపివేశామని కోర్టుకు నివేదించారు. భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూసు కుంటామని హామీ ఇచ్చారు. అయితే.. ఫేక్ వీడియోస్‌తో తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. మినహాయింపులకు లోబడే కొన్ని చెట్లను తొలగించినట్లు వెల్లడించారు.

మధ్యలో జస్టిస్ గవాయి స్పందిస్తూ... చెట్లు కొట్టేసే ముందు అనుమతులు తీసుకు న్నారా? లేదా? స్పష్టంగా చెప్పాలన్నారు. ఇందుకు అవును, అనుమతులు తీసుకున్నా మని సింఘ్వీ బదులిచ్చారు. 1300 చెట్లకు మినహాయింపు ఇచ్చామని, ఇందుకు సెల్ఫ్ సర్టిఫికేషన్, ఇతర నిబంధనలు పాటించినట్లు తెలిపారు. అనుమతులతోనే ఆ భూముల్లో జామాయిల్ తరహా చెట్లు, పొదలను తొలగించామన్నారు. మరోసారి జస్టిస్ గవాయి జోక్యం చేసుకొని.... పర్యావరణానికి సంబంధించి 1996 డిసెంబర్ 12లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు చేశారా? అని ప్రశ్నించారు.

సీఎస్, ఉన్నతాధికారులు జైలుకు వెళ్లకుండా కాపాడుకోవాలంటే... నష్టం జరిగిన 100 ఎకరాల్లో చేపట్టబోయే పునరుద్ధరణపై ప్రణాళికతో రావాలని ధర్మాసనం స్పష్టం చేసింది. చెట్ల నరికివేతను సమర్థించుకోవద్దు అని హెచ్చరించింది. వాటిని ఎలా పునరుద్ధరిస్తారనే ప్రణాళికతో రావాలని ప్రభుత్వ అడ్వొకేట్‌కు సూచించింది. 'చీఫ్ సెక్రెటరీ ఒక మహిళ, ఆమె నెలలో రిటైర్డ్ అవుతున్నారు. కేవలం కో-ఆర్డినేటర్‌గా మాత్రమే వ్యవహరించారు' అని సింఘ్వి కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ విషయంలో మార్చి, 2024 నుంచి కొనసాగుతున్నారని నివేదించారు. ఈ వాదనలపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'అందుకే స్పాట్‌లోకి పెద్ద సంఖ్యలో బుల్డోజర్లు వెళ్లాయా?. ఇది ఆశ్చర్యకరంగా ఉంది.' అని వ్యాఖ్యానించింది. ఈ ఏడాది మార్చిలో మూడు రోజులు సెలవు కావడంతో చెట్లను తొలగించేందుకు బుల్డోజర్లు తెచ్చారని కామెంట్ చేశారు. చెట్ల నరికివేతకు ఇంత అర్జెన్సీ ఏముందని ప్రశ్నించింది. ఉన్నత స్థాయి అధికారిగా ఉన్నప్పుడు బాధ్యత వహించాలని పేర్కొంది. దేశ సరిహద్దుల మీదుగా సాగే చార్‌ధామ్ యాత్ర కోసం రోడ్డు నిర్మాణానికి చెట్లు తొలగిస్తామంటే అనుమతించలేదని స్పష్టత ఇచ్చింది. ఇరు దేశాల మధ్య వార్ సమయంలో ఈ రోడ్ కీలకమని కేంద్రం ఏండ్లుగా పోరాటం చేస్తోన్నా అనుమతించలేదని తెలిపింది.

# తెలంగాణ పోలీసింగ్ నెంబర్ వన్

- 6.48 స్కోరు సాధించి మొదటి స్థానంలో
- 6.44 స్కోర్‌తో రెండో స్థానంలో ఏపీ పోలీస్
- రాష్ట్రంలో మహిళా పోలీసులు 8.7%, మహిళా అధికారులు 7.6%
- ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025 ర్యాంకింగ్స్ విడుదల




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అత్యుత్తమ పోలీసింగ్‌కు సంబంధించి ఇండియన్ జస్టిస్ రిపోర్ట్-2025 ర్యాంకింగ్‌లో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచింది. ఏపీ రెండో స్థానంలో ఉంది. పోలీస్, న్యాయవ్యవస్థ, జైళ్లశాఖ, లీగల్ ఎయిడ్ పనితీరుపై ఇండియన్ జస్టిస్ రిపోర్ట్ (ఐజేఆర్) 2019 నుంచి ప్రతి ఏటా నివేదిక విడుదల చేస్తోంది. ఈ క్రమంలో తాజా రిపోర్టు బుధవారం విడుదలైంది.

అత్యుత్తమ పోలీసింగ్‌కు సంబంధించి తెలంగాణ 10 మార్కులకు 6.48 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ ఈ విభాగంలో రెండో స్థానంలో ఉంది. పశ్చిమ బెంగాల్ అత్యల్పంగా 3.36 మార్కులతో చివరి స్థానంలో ఉంది. పోలీస్, న్యాయవ్యవస్థ, జైళ్లశాఖ, లీగల్ ఎయిడ్ పనితీరును కలిపి చూస్తే, తెలంగాణ జాతీయ స్థాయిలో మూడో స్థానంలో ఉంది. గత నివేదికలో 11వ స్థానంలో ఉన్న తెలంగాణ ఈసారి గణనీయమైన మెరుగుదల చూపింది.

పోలీస్, న్యా యవ్యవస్థ, జైళ్లశాఖ, లీగల్ ఎయిడ్ సహా మొత్తం 32 అంశాలకు సంబంధించి10 మిలియన్ల కంటే ఎక్కువ జనాభా కలిగిన తెలంగాణ, ఏపీ సహా18 పెద్ద రాష్ట్రాలు, 10 మిలియన్ల లోపు జనాభా గల సిక్కిం సహా 7 చిన్న రాష్ట్రాల్లో సర్వే చేసి ర్యాంకింగ్స్ విడుదల చేశారు.

ఆయా రాష్ట్రాల్లో పోలీసింగ్?కు సంబంధించి ఉత్తమ, మధ్యంతర, ప్రతిభ లేని కేటగిరీల వారీగా ర్యాంకులను ప్రకటించారు. గరిష్టంగా 10 పాయింట్ల స్కోరింగ్ ప్రాతిపదికన ర్యాంకింగ్స్ ఇచ్చారు. ఇందులో రాష్ట్ర పోలీసులు 6.48 పాయింట్ల స్కోరింగ్‌తో దేశంలో టాప్ వన్ పోలీస్‌గా ర్యాంకింగ్ పొందారు. పోలీసిం గ్‌లో తెలంగాణ తొలిస్థానాన్ని దక్కించుకోగా.. పోలీ స్, న్యాయవ్యవస్థ, జైళ్లశాఖ, లీగల్ ఎయిడ్ అంశాల్లో కలిపి ఓవరాల్ గా చూస్తే.. జాతీయ స్థాయిలో 3వ స్థానంలో నిలిచింది.

అన్ని విభాగాల్లో కలిపి గత నివేదికలో11వ స్థానంలో నిలువగా ఈ ఏడాది 3వ స్థానానికి చేరింది. కాగా, జాతీయ స్థాయిలో ప్రతి లక్ష మందికి 155 మంది పోలీసులు ఉన్నట్టు నివేదిక వెల్లడించింది. ఇక తెలంగాణ పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది సంఖ్య 8.7 శాతం కాగా, మహిళా అధికారు ల సంఖ్య 7.6 శాతంగా వెల్లడించింది.

దశాబ్దకాలంగా దేశవ్యాప్తంగా జైళ్లలో ఖైదీల సంఖ్య 50 శాతం పెరిగినట్టు నివేదిక వెల్లడించింది. ఇందు లో అండర్ ట్రయల్ ఖైదీల సంఖ్య గతంతో పోలిస్తే 66 శాతం నుంచి 76 శాతానికి చేరినట్టు పేర్కొంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల బడ్జెట్‌లలో క్రిమినల్ జస్టిస్ సిస్టంకు ఇస్తున్న? కేటాయింపుల్లో అత్యధికంగా జీతభత్యాలు కాగా, మౌలిక వసతుల కేటాయింపునకు అతి తక్కువగా ఖర్చు చేస్తున్నట్టు నివేదిక వెల్లడించింది. జాతీయ స్థాయిలో పోలీస్ శాఖలో మహిళల సంఖ్య 8 శాతం మాత్రమే ఉన్నట్టు తెలిపింది.

## యావత్ పోలీసు సిబ్బందికి అభినందనలు

- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అత్యుత్తమ పనితీరుతో తెలంగాణ పోలీసు శాఖ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచినందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి యావత్ పోలీసు సిబ్బందికి అభినందనలు తెలిపారు. 'ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025' ప్రకారం, కోటి కంటే ఎక్కువ జనాభా ఉన్న 18 రాష్ట్రాలలో పోలీసింగ్ విషయంలో తెలంగాణ పోలీసు శాఖ మొదటి స్థానంలో నిలిచింది. టాటా ట్రస్ట్, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్, కామన్ కాజ్ వంటి ప్రఖ్యాత సంస్థలు రూపొందించిన ఈ నివేదికలో తెలంగాణకు గొప్ప గుర్తింపు దక్కడం రాష్ట్ర పోలీసుల కృషికి దక్కిన గౌరవమని, ఈ ఘనత రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని ముఖ్యమంత్రి అన్నారు.

శాంతిభద్రతలు కాపాడడం, నేరాలను నియంత్రిం చడం, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసుల నమోదులో పారదర్శకత చూపడం ద్వారా తెలంగాణ పోలీసులు రాష్ట్రంలో శాంతి, న్యాయం నిలబెట్టడంలో విజయవంతమయ్యారని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు. రాజీలేని కర్తవ్య నిర్వహణతో పోలీసులు ప్రజల్లో నమ్మకాన్ని పెంచారని, ప్రజా పాలనలో ఈ విజయం పోలీసు శాఖ సమిష్టి కృషి ఫలితమని ముఖ్యమంత్రి గారు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి విజయాలను తెలంగాణ పోలీసులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

**సింగరేణి సంస్థ చరిత్రలో మొదటిసారి బయటి రాష్ట్రంలో బొగ్గు తవ్వకాలు ప్రారంభించడం అభినందనీయం..**

సింగరేణి సంస్థ చరిత్రలో మొదటిసారి బయటి రాష్ట్రంలో బొగ్గు తవ్వకాలు ప్రారంభించడం అభినందనీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. దాదాపు 130 ఏళ్లుగా తవ్వకాలు సాగిస్తూ రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న తెలంగాణ సింగరేణి రాష్ట్రం బయట ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకులో తవ్వకాలు ప్రారంభించి భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు వేసిందని పేర్కొన్నారు. ఒడిశాలోని అంగుల్ జిల్లాలో సింగరేణి సంస్థ తనకు కేటాయించిన బొగ్గు గనులకు అన్ని అనుమతులు సాధించి అందులో తవ్వకాలు ప్రారంభించడం శుభ పరిణామంగా ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు. ఇది తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే సందర్భమని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు సింగరేణి సంస్థకు అభినందనలు తెలియజేశారు.



## నేటి నుంచి
## భూ భారతి అవగాహనా సదస్సులు

- ప్రత్యేక ఫార్మాట్‌లో ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భూ భారతి చట్టంపై గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులతో పాటు దాని అమలుపై ఎంపిక చేసిన నాలుగు మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సదస్సు లక్ష్యాలు, ప్రజల నుంచి ఫిర్యాదులు, సలహాలు తీసుకోవడం తదితర అంశాలపై ఆయన సంబంధిత అధికారులతో బుధవారం హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. ప్రయోగాత్మకంగా భూభారతిని అమలు చేసే నాలుగు మండలాల్లో భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటికి రశీదులను అందజేయాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక ఫార్మాట్‌లో తయారుచేసిన దరఖాస్తులను రెవెన్యూ సదస్సు ముందురోజే ప్రజలకు ఇవ్వాలని సూచిచారు. "ఎలాంటి భూసమస్యలున్నాయి? ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయి? వాటిని ఏవిధంగా పరిష్కరించాలి? రానున్న రోజుల్లో చేపట్టాల్సిన చర్యలు, పోర్టల్‌పై ప్రజాస్పందనను చూసి భవిష్యత్తులో ఏవిధంగా ముందుకు వెళ్లాలి" అనే విషయంపై అధికారులకు పలు సూచనలు చేశారు. కోర్టు పరిధిలో ఉన్న భూములు మినహా ప్రతి దరఖాస్తును మే ఒకటి నుంచి పరిష్కరిస్తామని మంత్రి వెల్లడించారు. వచ్చిన దరఖాస్తులను ఏరోజుకారోజు కంప్యూటర్‌లో నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపించాలని వారికి సూచించారు. అవగాహన సదస్సులకు సంబంధించి కలెక్టర్లు ప్రతిరోజూ ప్రతి మండలంలో రెండు కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశాంచారు. మండల కేంద్రాల్లో తహశీల్దార్లు డిప్యూటీ తహశీల్దార్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు బృందాలుగా ఏర్పడి సదస్సులు నిర్వహించాలని సూచించారు. భూ సమస్యలు లేని తెలంగాణే లక్ష్యంగా సర్కార్ భూ భారతి చట్టాన్ని తెచ్చిందనీ, అందుకు అధికారులు కృషి చేయాలని కోరారు.

నారాయణ్‌పేట జిల్లా మద్దూర్ మండలంలోని కాజాపురం గ్రామంలో పైలట్ ప్రాజెక్ట్‌ను గురువారం తానే స్వయంగా ప్రారంభించనున్నట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఆ తర్వాత వికారాబాద్ జిల్లా పూడూరు గ్రామంలో జరిగే అవగాహనా సదస్సులో పాల్గొంటానని చెప్పారు. 18న ములుగు జిల్లా వెంకటాపురం, ఆదిలాబాద్ జిల్లాలో జరిగే సదస్సులోనూ పాల్గొంటానని మంత్రి పొంగులేటి తెలిపారు. వీటితో పాటు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాల్లో ప్రయోగాత్మకంగా ఈచట్టాన్ని ప్రారంభిస్తున్నామని వెల్లడించారు.

## తెలంగాణలో మరో కీలక ఒప్పందం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




తెలంగాణలో పెట్టుబడుల పెట్టేందుకు పలు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాప్రభుత్వం తీసుకొచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ న్యూ ఎనర్జీ పాలసీకి ఆకర్షితులై తెలంగాణలో పెట్టుబడులకు ఆయా కంపెనీలు ముందుకు వస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ వేదికగా జరిగిన కార్యక్రమంలో భట్టి విక్రమార్క సమక్షంలో మొత్తంగా 29 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులకు TG REDCOతో ఎకోరేస్ ఎనర్జీ ఇండియా, జీపీఆర్ఎస్ ఆర్య కంపెనీ ప్రతినిధులు ఎంవోయూ చేసుకున్నారు. ఈ సందర్భంగా.. తెలంగాణ ప్రభుత్వ న్యూ ఎనర్జీ పాలసీతో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు టీమ్ దావోస్ వెళ్ళినప్పుడు సన్ పెట్రో కంపెనీ 3400 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తికి 20వేల కోట్ల రూపాయలు పెట్టుబడులకు ఎంవోయూ చేసుకున్నట్లు భట్టి విక్రమార్క గుర్తు చేశారు.

అలాగే.. మెగా కంపెనీ 1500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తి చేయడానికి 7,500 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిందన్నారు. ఈ రెండు కంపెనీలు డీపీఆర్ తయారు చేసే పనిలో ఉన్నాయని తెలిపారు. ఇప్పుడు 27 వేల కోట్ల పెట్టుబడులతో 5,600 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ఎకోరేస్ ఎనర్జీ ఇండియా కంపెనీ, 15 జిల్లాల్లో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టుల అభివృద్ధికి జీపీఆర్ఎస్ ఆర్య కంపెనీ 2 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు ఎంఓయూ చేసుకున్నట్లు వెల్లడించారు భట్టి విక్రమార్క.

## సుప్రీంకోర్టు ఆదేశాలను పాటిస్తాం

- మంత్రి శ్రీధర్ బాబు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశాలను తప్పకుండా పాటిస్తామని తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ చేసిన పోస్టుపై చట్టప్రకారం తాము ముందుకు వెళతామని ఆర్టిఫి షియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఫొటోను షేర్ చేసినందుకు పోలీసులు ఆమెకు నోటీసులు జారీ చేయడంపై ఆయన స్పందించారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశాలను తప్పకుండా పాటిస్తామని మంత్రి తెలిపారు. కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసిందని గుర్తు చేశారు. నకిలీ వీడియోలు, ఫొటోలు అన్ని వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భూముల విషయం కోర్టు పరిధిలో ఉన్నందున దీనిపై ఏమీ మాట్లాడలేమని పేర్కొన్నారు. నెమళ్లు జనావాసాల్లోకి రావడం సహజమేనని అన్నారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ నేతలు ఇచ్చిన తప్పుడు సమాచారంతోనే కంచ గచ్చిబౌలి భూములపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారని మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేయాలని కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. తమది కూలగొడితే కూలిపోయే ప్రభుత్వం కాదని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్ర పన్నుతున్నట్లుగా భావిస్తున్నామని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

## ధ్వంసం చేసిన అడవులను పునరుద్ధరించాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**



కంచ గచ్చిబౌలి పైన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆహ్వానించారు. సుప్రీం కోర్టు ఆదేశాలను బీఆర్ఎస్ పార్టీ హృదయపూర్వకంగా స్వాగతం తెలుపుతుందని కేటీఆర్ తెలిపారు. కంచ గచ్చిబౌలిలో ధ్వంసం చేసిన అడవులను పునరుద్ధరించాలంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను అందరూ స్వాగతించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు రాష్ట్ర చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌కు వన్యప్రాణులను కాపాడాలంటూ ఆదేశాలు ఇవ్వడం గొప్ప విజయం. వన్యప్రాణుల పట్ల, పర్యావరణ పరిరక్షణకు పాటుపడే ప్రతి ఒక్కరికి దక్కిన విజయం ఇది. సుప్రీం కోర్టు ఉత్తర్వులు హైదరాబాద్‌తో పాటు తెలంగాణ పర్యావరణ పరిరక్షణకు గొప్ప ఊతం. గొంతులేని మూగజీవాల కోసం, చెట్ల కోసం, పర్యావరణం కోసం అండగా నిలబడిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు ధన్యవాదాలు. 400 ఎకరాల కంచ గచ్చిబౌలి అడవిని కాపాడి, హైదరాబాద్ భవిష్యత్తు కోసం నిలబడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల పట్ల కృతజ్ఞతలు.

సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కేంద్ర సాధికారిక కమిటీ ఇచ్చిన సిఫార్సులను కూడా బీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తున్నది. కంచ గచ్చిబౌలిని ప్రైవేట్ పార్టీకి తాకట్టు పెట్టిన రేవంత్ ప్రభుత్వ వ్యవహారంలో.. ఆర్థిక అవకతవకలు జరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేసిన కేంద్ర సాధికారిక కమిటీ మా పార్టీ వాదనను బలపరుస్తున్నది. కంచ గచ్చిబౌలి భూముల తాకట్టు విషయంలో పదివేల కోట్ల రూపాయల అవినీతికి రేవంత్ రెడ్డి పాల్పడ్డారని చేసిన ఆరోపణలను పునరుద్ఘాటించిన కేటీఆర్. అడవుల పట్ల, వన్యప్రాణుల పట్ల రేవంత్ రెడ్డి నెంబర్ వన్ విలన్‌గా మారాడని విమర్శించిన కేటీఆర్. పర్యావరణ విధ్వంసానికి, పర్యావరణ హత్యకు పాల్పడి తప్పించుకోలేరనే కనీస సోయి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇకనైనా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేసిన కేటీఆర్. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి తనను తాను మోసం చేసుకున్న విషయాన్ని అర్థం చేసుకుని, పర్యావరణ విధ్వంసం ఆపాలని కోరారు.



## సీఎం రేవంత్ రెడ్డికి జపాన్‌లో ఘన స్వాగతం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందానికి జపాన్ లో ఘన స్వాగతం లభించింది. టోక్యోలోని 100 ఏళ్ల చరిత్ర కలిగిన ఇండియా హౌస్‌లో జపాన్‌లోని భారత రాయబారి శిబు జార్జ్ గారు తెలంగాణ ప్రతినిధి బృందాన్ని స్వాగతించి, వారికి ఘనంగా విందు ఇచ్చారు. జపాన్ లోని భారత రాయబారి గారితో ముఖ్యమంత్రి సమకాలీన అంశాలపై చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో డిఎంకె ఎం కనిమొళి కరుణానిధి , నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి , మాజీ ఎంపీ నెపోలియన్ , పలువురు అధికారులు పాల్గొన్నారు.

## గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఇటీవల టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో భారీగా అవకతవకలు జరిగాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. ఇది దేశ విద్యావ్యవస్థలోనే అతిపెద్ద స్కామ్ అని అన్నారు. మొత్తం 21,093 మంది గ్రూప్-1 పరీక్షలు రాస్తే 21,103 మంది ఫలితాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. పది మంది అదనంగా ఎక్కడి నుంచి వచ్చారని నిలదీశారు. కరీంనగర్‌లో మరో ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి నిర్వహించిన ప్రెస్‌మీట్ ఆయన మాట్లాడారు. ఉర్దూ మీడియంలో 9 మంది పరీక్ష రాశారని ఒకసారి, 10 రాశారని మరోసారి టీజీపీఎస్సీ రిపోర్ట్ ఇచ్చిందని, ఇందులో ఏది నిజం, ఏది అబద్ధమని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. ప్రిలిమ్స్‌కు ఒక హాల్ టికెట్, మెయిన్స్‌కు మరో హాల్ టికట్ ఇచ్చిన సందర్భం దేశ చరిత్రలో లేదని మండిపడ్డారు. ఈ అంశం టీజీపీఎస్సీ చేతిలో ఉంటుందని సమర్థించుకుంటున్నారని, అక్కడే స్కామ్‌కు ఆస్కారం ఏర్పడిందని విమర్శించారు.

ఒకే పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసిన 654 మందికి సేమ్ మార్కులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కోఠిలోని ఓ సెంటర్లో పరీక్షలు రాసిన 1,497 మందిలో 75 మంది ఉద్యోగాలకు సెలెక్ట్ అయ్యారని, మిగతా 25 సెంటర్లలో 10,135 మంది పరీక్షలు రాస్తే కేవలం 65 మందే సెలెక్ట్ అయ్యారని ఇదెలా సంభవమని నిలదీశారు. ఉర్దూలో పరీక్షలు రాసిన 9 మందిలో ఏడుగురికి ఉద్యోగాలు ఎలా వచ్చాయని అడిగారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ రాములు నాయక్ కోడలుకు మల్టీజోన్‌లో నంబర్ 1 ర్యాంకు, స్టేట్‌లో 206వ ర్యాంకు వచ్చిందని అన్నారు.

పరీక్ష రాసిన వారికంటే అదనంగా వచ్చిన 10 మందిలో రాములు నాయక్ కోడలు ఉన్నదని కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ నాయకులు ఈ విషయమై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి నుంచి పెద్ద ఎత్తున ముడుపులు ముడుతున్నాయని, అందుకే బీజేపీ నోరు మెదపడం లేదని ఆరోపణ చేశారు. బీఆర్ఎస్ హయాంలో చిన్నచిన్న పరీక్షల పేపర్లు లీకైనాయని ఎగిరెగిరి దుంకిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్.. ఇపుడు ఇంత పెద్ద స్కామ్ జరిగినా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

# ఒక్క పాత్రికేయుడు వెయ్యి మందితో సమానం..



**-ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్**

**-వ్రేములవాడ ప్రెస్ క్లబ్ నూతన భవనం(ఐ జే యు) ప్రారంభం**

**బలగం టీవీ, వేములవాడ:**

ఒక్క పాత్రికేయుడు వెయ్యి మందితో సమానం అని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన భవనం(ఐ జే యు) ను రాష్ట్ర ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఐ జే యు రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ కరోనా తర్వాత పాత్రికేయ రంగం పూర్తిగా మారిపోయిందని అన్నారు.పాత్రికేయ మిత్రులతో 1987 నుండి అనుబంధం ఉందని, అనాడు రుద్ర%శీ%గి నుండి వచ్చి వేములవాడ లో పాత్రికేయులకు వార్తలను అందించే వాడిని అని అన్నారు.సోషల్ మీడియా వల్ల మంచి ఉంది చెడు ఉందని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత అసెంబ్లీ సమావేశాలలో అందరికి పాత్రికేయులకు పలు సూచనలు సలహాలు చేశారని,నైతిక విలువలతో పాత్రికేయులు ముందుకు పోవాలని అన్నారు.ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వరదిగా పాత్రికేయులు ఉంటారని అన్నారు.ప్రెస్ క్లబ్ ను మరింత ముందుకు తీసుకపోడానికి నా వంతు సహాయం చేస్తానని అన్నారు.మీరు లేనిది నేను లేను అని,త్వరలోనే జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు మంజూరు కు కృషి చేస్తానని అన్నారు.నా గెలుపు లో పాత్రికేయుల పాత్ర మరువలేనిదని అన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధి కి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఆలయ అభివృద్ధి కి నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు.


గత పాలకులు ఎమ్మెల్యే పదవిని వారి హెూద కోసం వాడుకున్నారని అన్నారు. వేములవాడ పట్టాన,ఆలయ అభివృద్ధి కి కృషి చేస్తానని,త్వరలోనే వేములవాడ ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.రాజన్న భక్తుల మనోభావాలు పాటిస్తూ రాజన్న ఆలయ అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని అన్నారు.

ఎవరు అడగకున్న్ను ధనిక పేద తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని,దాన్ని చూస్తూ ఓర్వలేక కొందరు బీజేపీ నాయకులు మేం పంచుతున్నం అని గొప్పలు చెప్తున్నారని అన్నారు.మన పక్కన ఉన్న మహారాష్ట్ర,ఆంధ్రప్రదేశ్లో వారి అనుకూల ప్రభుత్వాలు ఉన్నాయి, మరి ఆయా రాష్ట్రాల్లో ఎందుకు పంపిణీ చేయడం లేదని అన్నారు.

పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేయడం జరుగుతుందని,బీసీలకు 43 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చేయడం జరుగుతుందన్నారు.

### పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో వేములవాడ పట్టణ అర్బన్,రూరల్ మండలాలకు చెందిన 82 లక్షల విలువగల 82 షాది ముబారక్, కల్యాణ లక్ష్మి,ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అది శ్రీనివాస్ మాట్లాడుతూ ఎవరు ఊహించని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పేద ధనిక తేడా లేకుండా అందరికీ సన్న బియ్యం అందజేస్తుందని అన్నారు. పేదలకు సన్న బియ్యం అందిస్తుంటే బిజెపి నాయకులు కేంద్రం ద్వారా ఇస్తున్నాం అని గొప్పలకు పోతున్నారన్నారు. కేంద్రం ద్వారా సన్న బియ్యం అందిస్తే ఇతర రాష్ట్రాల్లో ఎందుకు సన్నబియ్యం ఇవ్వడం లేదని బిజెపి నాయకులను ప్రశ్నించారు.. గొప్పలు చెప్పడం మానీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమమే పరమావధిగ ముందుకు పోతుందన్నారు.





# లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి..

**-ఒంటరి మహిళలు,నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత**

**-ఎంపీడీవో జయశీల**

**బలగం టీవీ, బోయినిపల్లి**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎంపికలో ఎవరి ప్రలోభాలకు లొంగకుండా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో జయశీల అన్నారు.బోయినిపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక కమిటీలు, కార్యదర్శుల, ప్రత్యేక అధికారులతో ఎంపిడివో జయశీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడివో జయశీల మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యతగా ఒంటరి మహిళలను,అతి నిరుపేదలను గుర్తించాలని, ఏ ఒక్క నిరుపేద కూడా మిస్ కావద్దని అన్నారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం 400 గజాల కంటే ఎక్కువ నిర్మించకూడదు అని, 600 గజాలు దాటితే ప్రభుత్వ పథకం వర్తించదని అన్నారు.కమిటీలు ఎంపిక చేసిన దాని ప్రకారం లబ్ధిదారులను గుర్తిస్తామని, ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని అన్నారు. కార్యదర్శులు ఎప్పటికప్పుడు కమిటీ సభ్యులకు సూచనలు సహాలహాలు ఇవ్వాలని, ఏదైనా తేడాలు వస్తే కార్యదర్శులు బాధ్యత వహించాలనిఅన్నారు. మండలానికి 750 ఇళ్ళను ప్రభుత్వ మంజూరు చేసిందని, నియోజకవర్గానికి 3,500 ఇండ్లు ప్రభుత్వ మంజూరు చేస్తే,చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొరవతో మండలానికి 750 ఇల్లు మంజూరయ్యాయని అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నారాయణరెడ్డి, మండల పంచాయతీ అధికారి శ్రీధర్, తదితరులు ఉన్నారు.



# ఎమ్మెల్సీగా దాసోజు శ్రవణ్ ప్రమాణ స్వీకారం

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన దాసోజు శ్రవణ్ కుమార్ శాసనమండలిలో ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథులుగా హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు, మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు దాసోజు శ్రావణ్ కుమార్ కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగారకుంట నవీన్ కుమార్ రెడ్డి దాసోజు శ్రవణ్ కుమార్ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ శాసనమండలిలో ప్రజా ప్రయోజనాల కోసం కలిసి పనిచేద్దామని శుభాకాంక్షలు తెలియజేశారు.

# స్మితా సబర్వాల్‌కు గచ్చిబౌలి పోలీసుల నోటీసులు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇన్‌స్టాగ్రాంలో కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించిన తప్పుడు వీడియోలు ట్యాగ్ చేశారని తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు గచ్చిబౌలి పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 12న స్మితా సబర్వాల్‌కు గచ్చిబౌలి పోలీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో తప్పుడు వీడియోలు ట్యాగ్ చేసినందుకు సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌కు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 179 కింద ఆమెకు నోటీసులు జారీ చేసినట్లు గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ మహ్మద్ హబీబుల్లా ఖాన్ తెలిపారు.

ఇప్పటికే కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో పోలీసులు పలువురికి నోటీసులు జారీ చేసి విచారణకు పిలుస్తున్నారు. ఈ క్రమంలోనే సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌కు నోటీసులు జారీ చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మార్చి 31న హాయ్ హైదరాబాద్ అనే ట్విట్టర్ హ్యాండిల్ నుంచి పోస్ట్ చేసిన గిబ్లి తరహాలో ఉన్న ఇమేజ్‌ని స్మితా సబర్వాల్ రీట్వీట్ చేశారు. ఈ ఫొటో ఫేక్ ఇమేజ్‌గా పోలీసులు గుర్తించారు. దీంతో ఆమెకు పోలీసులు నోటీసులు జారీ చేశారు.

# వక్ఫ్ సవరణ గురించి మీరెందుకు తొందరపడ్డారు?

**బలగం టీవీ, హైదరాబాద్**



కేంద్రం ఆమోదించిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఏప్రిల్ 11న పశ్చిమబెంగాల్ ముర్షిదాబాద్‌లో నిరసనలు జరిగాయి. ఈ నిరసనల్లో ముగ్గురు మృతి చెందారు. తాజాగా మృతి చెందిన వారికి బెంగాల్ ప్రభుత్వం 10 లక్షల రూపాయల నష్టపరిహారాన్ని ప్రకటించింది. అలాగే ఈ ఘర్షణల వల్ల ఇళ్లు, దుకాణాలు ధ్వంసం అయితే వాటిని బంగ్లార్ బరి (హౌస్ స్కీమ్) కింద వాటిని రిపేర్ చేయిస్తామని బుధవారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతాబెనర్జీ వెల్లడించారు. నష్టపోయిన ఇళ్లు, దుకాణాలకు సంబంధించిన అంచనాను ఆ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ పరిశీలిస్తారని.. వాటిని త్వరలోనే రిపేర్ చేయిస్తామని మమతా ప్రకటించారు. కాగా కోల్‌కతాలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. ముర్షిదాబాద్ మృతులకు నష్టపరిహారిన్ని ప్రకటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'నేను కేంద్ర ప్రభుత్వానికి సవాల్ విసురుతున్నాను. వక్ఫ్ సవరణ గురించి మీరెందుకు అంత తొందరపడ్డారు? బంగ్లాదేశ్ పరిస్థితి మీకు తెలియదా? బెంగాల్.. నేపాల్, బంగ్లాదేశ్, భూటాన్‌లతో సరిహద్దును పంచుకుంటుంది. దానివల్ల దేశానికి మంచి జరిగితే నేను సంతోషిస్తాను. కానీ వారి ప్రణాళిక ఏంటి? అక్కడి నుంచి ప్రజల తరలింపును సులభతరం చేసే కొన్ని ఏజెన్సీలను ఉపయోగించి అల్లర్లకు పాల్పడటమా? తాజాగా జరిగిన అల్లర్లలో బంగ్లాదేశ్‌కు ప్రమేయం ఉందని హెూం మంత్రిత్వశాఖ వర్గాలను ఉటంకిస్తూ నిన్న నేను ఒక ట్వీట్ చేశాను. అదే జరిగితే, కేంద్ర ప్రభుత్వమే దానికి బాధ్యత వహించాలి. ఎందుకంటే సరిహద్దుల్ని కాపాడేది బిఎస్ఎఫ్‌నే. మేము కాదు' అని ఆమె అన్నారు.మేము సర్వధర్మ సమభావాన్ని విశ్వసిస్తాము. నేను రామకృష్ణ పరమహంసను, స్వామి వివేకానందను నమ్ముతాను. బిజెపి ప్రకటనతో ఆందోళన చెంది బెంగాల్‌లో అశాంతి సృష్టించాలనుకుంటే.. దానిని నియంత్రించమని నేను కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాను అని మమతా అన్నారు.

# హజ్ యాత్రపై సౌదీ ప్రభుత్వం షాకింగ్ నిర్ణయం

**బలగం టీవీ, హైదరాబాద్**

పిల్లలతో సహా హజ్ యాత్ర కు వెళ్ళాలనుకునే వారికి సౌదీ ప్రభుత్వం షాకింగ్ న్యూస్ చెప్పింది. 12 ఏళ్ళలోపు పిల్లలను హజ్ యాత్రకు అనుమతించేది లేదని స్పష్టం చేసింది. దీంతో ఇప్పటికే రాష్ట్ర హజ్ కమిటీ ద్వారా హజ్ యాత్రకు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్న తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. రాష్ట్రం నుండి తల్లిదండ్రులతో కలిసి హజ్ యాత్రకు వెళ్తున్న 12 ఏళ్ల లోపు పిల్లల సంఖ్య 38 ఉంది. ఇప్పటికే వీరు హజ్ యాత్రకు సంబంధించి రుసుము చెల్లించి యాత్రకు సిద్ధమయ్యారు. చివరి నిముషంలో సౌదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వీరంతా తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. 38 మంది పిల్లల యాత్ర రద్దు కావడంతో పాటు వారి తల్లిదండ్రులు కూడా తమ యాత్రను రద్దు చేసుకుంటున్నారు.

చిన్న పిల్లలను వదిలి హజ్ యాత్రకు వెళ్లడం సాధ్యం కానందున తల్లిదండ్రులు ఇప్పటికే తమ యాత్రను రద్దు చేసుకున్నారు. 10 నుండి 12 ఏళ్ల వయస్సు ఉన్న కొంత మంది పిల్లల తల్లిదండ్రులు తమ బంధువుల వద్ద వారిని వదిలి వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. చిన్న పిల్లలు మాత్రం తల్లిదండ్రులను వదిలి ఉండలేని పరిస్తితి ఉన్నందున తల్లిదండ్రులు కూడా తమ యాత్రను రద్దు చేసుకుంటున్నట్ల రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ గులాం అఫ్జల్ బియా బాని తెలిపారు. వారు చెల్లించిన డబ్బులను తిరిగి చెల్లిస్తున్నట్లు తెలిపారు. సౌదీ ప్రభుత్వం పిల్లలను హజ్ యాత్రకు అనుమతించక పోవడం ఇదే తొలిసారి అని అధికారులు తెలిపారు. యాత్ర రద్దు చేసుకున్న 12 ఏళ్ళ లోపు పిల్లల వివరాలను రాష్ట్ర హజ్ కమిటి వెల్లడించింది.



## గ్రీన్ ఛాలెంజ్ హరితసేన..

**బలగం టీవీ, హైదరాబాద్**

బుధవారం ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేయమోయే ముందు డా.దాసోజ్ శ్రవణ్ గ్రీన్ ఛాలెంజ్ హరితసేనలో భాగంగా షేక్ పేట్ లోని ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణం లో కుటుంబ సమేతంగా మామిడి మొక్కను నాటారు. ఈ సందర్భంగా దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముందు శుభప్రధంగా మొక్కను నాటడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని అదే విధంగా వాటిని సంరక్షించాలని కోరారు. మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన ఈ గొప్ప కార్యక్రమంలో అందరూ భగస్వామ్యం అవ్వడం గొప్ప విషయం, ఈ అవకాశం కల్పించిన సంతోష్ కుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మార బోయిన రవి యాదవ్, హరితసేన రాష్ట్ర కోర్డినేటర్ గర్రెపల్లి సతీష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడి నూతన భవనాలకు భూమి పూజ

**బలగం టీవీ,తంగళ్ళపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో నూతనంగా ఎన్ఆర్ఈజీఎస్, ఐసిడిఎస్ మరియు పంచాయతీ రాజ్ నిధులనుండి 2024%-%25 సం" కు ఒక్కో అంగన్ వాడి కేంద్రానికి 12 లక్షల రూపాయలతో మంజూరైన రెండు నూతన అంగన్వాడీ భవనాలకు భూమి పూజా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు జలగం ప్రవీణ్,ప్యాక్స్ చైర్మెన్ కోడూరి భాస్కర్ గౌడ్, మార్కెట్ కమిటీ సభ్యుడు ఇట్టి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి,నాయకులు పబ్బడి కృష్ణారెడ్డి,మునిగేల రాజు, ఆసరి బాలరాజు,లింగారెడ్డి, తిరుపతి గౌడ్,మనోజ్, నరసింహులు,అనిల్ రెడ్డి , అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు మద్దతు ధర అందించేందుకు కొనుగోలు కేంద్రాలు..

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పపూర్ లోని ఏఎంసీలో ఐకెపి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు బుధవారం ఏర్పాటు చేయగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన ధాన్యాన్ని సమీపంలోని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. సరైన తేమ శాతంతో ధాన్యాన్ని నిర్వాహకులు సేకరిస్తారని వివరించారు. కొనుగోలు వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్ చేయాలని, డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం అమ్ముకోవడానికి వచ్చే రైతులు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలో ఐకెపి ఆధ్వర్యంలో మొత్తం 191 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని తెలిపారు. రైతులకు ఐకెపి వారు ఉత్తమ సేవలు అందిస్తున్నారని వివరించారు. మిల్లర్లు ధాన్యం సేకరించకపోతే సమీపంలోని ప్రభుత్వ గోదాముల్లో నిల్వ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేక అధికారి అఫ్జలి బేగం, డీఆర్డీఓ శేషాద్రి, తహసిల్దార్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రులలో వైద్య సిబ్బంది కొరత లేకుండా చూడాలి

**-లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలి..**

**-వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యధికంగా ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, అత్యవసరమైన పక్షంలోనే సి సెక్షన్ ఆపరేషన్లు నిర్వహించాలని ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. బుదవారం రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, సిరిసిల్ల వైద్య ఆరోగ్య శాఖ పని తీరు పై వైద్య అధికారులతో ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ రివ్యూ నిర్వహించారు. సిరిసిల్ల జిల్లా పరిధిలో లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్ లపై కఠిన చర్యలు తీసుకోవాలనీ ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ కలెక్టర్ మరియు జిల్లా వైద్యాధికారికి ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ, జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల పనితీరు నిరంతరం పర్యవేక్షించాలని, ఆడపిల్లలు బ్రుణ హత్యలు జర్గకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పి.సి.ఎన్.బి యాక్ట్ సంబంధించి ఎప్పటికప్పుడు జిల్లా అడ్వైజర్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని అన్నారు.జిల్లాలో నూతన ఆసుపత్రుల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మాత్రమే జరగాలని అన్నారు.

జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సిబ్బంది మరియు మందుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరాలకు అనుగుణంగా స్పెషలిస్ట్ డాక్టర్లను ఎప్పటికప్పుడు నియమించుకోవాలని, ప్రతి వ్యాధికి సంబంధించి అవసరమైన మందులు పూర్తి స్థాయిలో ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్నాయని, అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అందుబాటులో ఉన్న డ్రగ్స్ వివరాలపై వైద్య సిబ్బందికి అవగాహన కలిగి ఉండాలని, అందుబాటులో ఉన్న డ్రగ్స్ ను మాత్రమే రోగులకు ప్రిస్క్రైబ్ చేయాలని, రోగులు అనవసరంగా బయట ప్రైవేటుగా మందులు కొనాల్సిన అవసరం రావద్దనిఅన్నారు. డ్రగ్స్ స్టాక్ వివరాలు కట్టుదిట్టంగా నిర్వహించాలని సంచాలకులు అధికారులను ఆదేశించారు.

ప్రతి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి శాంపిల్స్ సేకరించి డయాగ్నస్టిక్ సెంటర్ ద్వారా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. రేడియాలజీ విభాగానికి సంబంధించి కూడా పరీక్షల నివేదికలు ఎప్పటికప్పుడు అందజేయాలని అన్నారు. ప్రతి ల్యాబ్ టెక్నీషియన్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటూ అవసరమైన సేవలు సమర్థవంతంగా అందించేలా చూడాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.రజిత, డా. లక్ష్మీ నారాయణ, డా. పెంచలయ్య, ప్రోగ్రాం ఆఫీసర్లు ,వైద్య అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## అది రైలు బండి కాదు.. అదొక రైలు బడి..

**-తరగతి గదులను రైలు బోగిలుగా మార్చి వైవిధ్యంగా విద్య బోధన.**

**-ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల**

**బలగం టీవీ, సిరిసిల్ల**

పిల్లలు బడికి పోవడానికి మారం చేస్తుంటారు, ఎందుకంటే ఇంట్లో ఉన్న వాతావరణం అక్కడ ఉండదు కాబట్టి. పిల్లలు పాఠశాలకు పెద్ద ఎత్తున వచ్చేలా ఆకర్షించేందుకు కొత్త విధానంలో బోధనకు శ్రీకారం చుట్టారు ఉపాధ్యాయులు. తరగతి గదులను రైలు బోగిలుగా మార్చి ప్రకృతి అందాలను పాఠాలుగా మార్చి చిన్నారులకు వైవిధ్యంగా విద్యను అందిస్తు, కార్పొరేట్ పాఠశాలకు దీటుగా నిలుస్తున్నది ఓ ప్రభుత్వ పాఠశాల. పిల్లలందరిని స్కూలుకు పరుగులు పెట్టేలా చేస్తోన్న ఈ ప్రభుత్వ పాఠశాల రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కందికట్క్యూర్ ( ఎస్సీ కాలనీ) గ్రామంలో ఉంది. ఇక్కడ రైలు మాదిరిగా కనిపిస్తున్న ఈ భవనమే ప్రభుత్వ పాఠాశాల. ఇక్కడ విద్యార్థుల సంఖ్యను పెంచుకోవడానికి, వినూత్న పద్ధతిలో బోధన చేస్తూ, స్కూల్ కాంప్లెక్స్ లెవల్లో పద్యాల పోటీ, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ వంటి కార్యక్రమాలను నిర్వహించి ముందుకు సాగుతున్నారు ఈ పాఠశాల ఉపాధ్యాయులు బద్దం రవీందర్ రెడ్డి, అనువోజు రాజు.విద్యార్థులకు నూతన ఉత్సాహాన్ని నింపడానికి వినూత్న ఆలోచన చేశారు ఈ ఉపాధ్యాయులు. దీనికి గ్రామ పెద్దలు మాజీ ఎంపీటీసీ యాస తిరుపతి,మాజీ సర్పంచ్ ముత్యం అమర్ గౌడ్, ఇల్లంతకుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేణు రావు, రాఘవేంద్ర హాస్పిటల్ వెంకటేశ్వరరావు మరియు చిరంజీవి ల సహాయంతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కందికట్క్యారు( ఎస్సీ కాలనీ)పాఠశాలను రైలు బండిగా మార్చేశారు.అన్ని పాఠశాలలో కన్న కూడా ఈ పాఠశాల విభిన్నంగా ఉందని, ప్రధానోపాధ్యాయులు బద్దం రవీందర్ రెడ్డి,ఉపాధ్యాయులు అనువోజు రాజు మరియు అంగన్వాడి మేడం లక్ష్మీ పిల్లలని బాగా చూసుకుంటున్నారనీ, తమకు ఈ పాఠశాల బాగా నచ్చిందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికై వినతిపత్రం అందజేత

**బలగం టీవీ, తంగళ్ళపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్ల 3 నెలల పెండింగ్ వేతనాలు, ఎన్నికల హామీలో ఇచ్చిన ప్రకారంగా ఎఫ్ టి ఈ మరియు పే స్కేల్ మరియు ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, మరియు ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని ఐ ఎన్ టి యు సి ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండల ఎంపీడీవో కి వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు కొమ్మేట దేవయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఆకునూరి శ్రీనివాస్, సాయిల పూర్ణ చందర్,గాలిపెల్లి తిరుపతి, సిరిసిల్ల శ్రీనివాస్, బిజిగ బాలకిషన్, రెడ్డిమల్ల ఆంజనేయులు,కొలపురి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ సూపర్ విక్టరీ

● సూపర్ ఓవర్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ గెలుపు




బలగం టీవీ, హైదరాబాద్

ఢిల్లీ క్యాపిటల్స్ సూపర్ ఓవర్‌లో విక్టరీ సాధించింది. బుధవారం ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది. మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 188 పరుగులు చేయగా, రాజస్థాన్ కూడా 188 పరుగులు మాత్రమే చేయగలిగింది. సూపర్ ఓవర్‌లో రాజస్థాన్ 11 పరుగులు చేసింది, ఢిల్లీ నాలుగు బంతుల్లోనే లక్ష్యాన్ని సాధించి ఐపీఎల్ లో ఐదో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ పోరెల్ 5 ఫోర్లు, ఒక సిక్స్‌తో 49 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కరుణ్ నాయర్ ఈసారి ఖాతా తెరవకుండానే రనౌట్‌గా వెనుదిరిగాడు. రాహుల్ 38 పరుగులు సాధించాడు. ధాటిగా ఆడిన స్టబ్స్ 18 బంతుల్లోనే రెండు సిక్స్‌లు, 2 ఫోర్లతో 34 పరుగులు చేశాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన అక్షర్ పటేల్ 14 బంతుల్లోనే 34 పరుగులు సాధించాడు. అశుతోష్ శర్మ 15 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.

189 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్లు సంజూ శాంసన్(31 రిటైర్డ్ హర్ట్), యశస్వి జైస్వాల్(51) మంచి ఆరంభాన్ని అందించారు. గాయం కారణంగా సంజు శాంసన్ పెవిలియన్ చేరడంతో క్రీజులోకి వచ్చిన రియాన్ పరాగ్(8) రాణించలేకపోయాడు. అనంతరం వచ్చిన నితీష్ రాణా(51) హాఫ్ సెంచరీతో అద్భుతంగా రాణించాడు. నితీష్ రాణా తర్వాత ధ్రువ్ జురెల్(26) చివరి వరకు క్రీజులో నిలిచి రాజస్థాన్ ను గెలిపించేందుకు ప్రయత్నించాడు. కానీ చివరి ఓవర్లో 9 పరుగులు అవసరమైన సమయంలో మిచెల్ స్టార్క్ అద్భుతంగా బౌలింగ్ చేసి కేవలం 8 పరుగులు మాత్రమే ఇచ్చాడు. ఈ క్రమంలో మ్యాచ్ టైగా ముగిసింది. దీంతో సూపర్ ఓవర్ అనివార్యమైంది.

సూపర్ ఓవర్లో ఢిల్లీ తరఫున మిచెల్ స్టార్క్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. నాలుగు బంతులు మాత్రమే ఆడిన రాజస్థాన్ రాయల్స్ 11 పరుగులు చేసి 2 వికెట్లు కోల్పోయింది. సూపర్ ఓవర్ లో 2 వికెట్లు కోల్పోతే తర్వాత ఆడే అవకాశం ఉండదు. 12 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ కేవలం 4 బంతుల్లోనే విజయాన్ని సాధించింది. ఢిల్లీ బ్యాటర్లు(7), స్టబ్స్(6) సూపర్ ఓవర్లో రాణించారు.

## గద్దర్ అవార్డుల జ్యూరీ చైర్‌పర్సన్‌గా జయసుధ



బలగం టీవీ, హైదరాబాద్

తెలుగు సినీ పరిశ్రమకు గద్దర్ అవార్డులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. 2014 జూన్ నుంచి డిసెంబర్ 2023 వరకు విడుదలైన సినిమాలకు ఈ ఏడాది అవార్డులను ఇవ్వనున్నట్లు ప్రకటించింది. గద్దర్ పేరుతో నిర్వహించనున్న ఫిల్మ్ అవార్డుల కోసం ప్రత్యేకంగా జ్యూరీ కమిటీని బుధవారం నియమించారు. చైర్‌పర్సన్‌గా ప్రముఖ నటి జయసుధ నియామకమయ్యారు. జ్యూరీ కమిటీ మొత్తం 15 మంది సభ్యులుంటారు. ఈ క్రమంలో జయసుధ అధ్యక్షతన కమిటీ తొలి సమావేశం బుధవారం జరిగింది. నగరంలోని ఎఫ్‌డీసీ మీటింగ్‌లో హాల్‌లో జరిగిన సమావేశంలో టీఎఫ్‌డీసీ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు పాల్గొన్నారు. ప్రభుత్వం 14 సంవత్సరాల తర్వాత సినీ రంగానికి అవార్డులను ఇస్తున్నదని.. గద్దర్ అవార్డులకు జాతీయస్థాయి గుర్తింపు దక్కేలా జ్యూరీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. అవార్డుల కోసం ఈ సారి 1,248 నామినేషన్లు అందాయి. వ్యక్తిగత కేటగిరీలో 1172, ఫీచర్ సినిమాలు, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీలు సహ వివిధ విభాగాల సినిమాలకు 76 దరఖాస్తులు వచ్చాయని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ హరీశ్ పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి స్క్రీనింగ్ జరుగుతుందని, అనంతరం అవార్డులు ప్రకటించనున్నట్లు జ్యూరీ సభ్యులు వివరించారు.

## ఏఐ ఆధారిత మీడియా కంపెనీని ప్రారంభించనున్న దిల్‌రాజు

బలగం టీవీ, హైదరాబాద్




టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మాణ సంస్థ అయిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో మంగళవారం సాయంత్రం "బోల్డ్... బిగ్... బియాండ్ ఇమాజినేషన్" అంటూ ఓ పోస్టు పెట్టిన విషయం తెలిసిందే. అన్నట్లుగానే బుధవారం ఉదయం 11.08 గంటలకు ఎస్వీసీ కీలక ప్రకటన విడుదల చేసింది. ఏఐ బేస్డ్ టెక్నికల్ కంపెనీ క్వాంటమ్ ఏఐ గ్లోబల్‌తో కలిసి ఏఐ ఆధారిత మీడియా కంపెనీ (ఏఐ స్టూడియో)ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. వినోద పరిశ్రమ కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన అధునాతన ఏఐ సాధనాలను అభివృద్ధి చేయడానికి, అందించడానికి ఈ ఏఐ స్టూడియో పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ సంస్థ పేరు, మరిన్ని వివరాలను మే 4న ప్రకటిస్తామని తెలిపారు. ఈ బిగ్ అనౌన్స్‌మెంట్‌కు భారతీయ సినిమా పరిణామ క్రమానికి సంబంధించిన ఓ వీడియోను కూడా దిల్ రాజు జోడించారు.




### సారంగపాణి జాతకం ట్రైలర్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

ప్రియదర్శి పులికొండ, రూప కొడువాయూర్ జంటగా మోహనకృష్ణ ఇంద్రగంటి డైరెక్షన్లో 'సారంగపాణి జాతకం' అనే జాతకం తెరకెక్కుతుంది. సీనియర్ నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన వినోదాత్మక చిత్రాన్ని ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. అయితే తాజాగా ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు.

## దేవీశ్రీ ప్రసాద్‌కు ఏపీ పోలీసులు షాక్

బలగం టీవీ, హైదరాబాద్

టాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ రాక్‌స్టార్ దేవీశ్రీ ప్రసాద్‌కు ఏపీ పోలీసులు ఊహించని షాక్ ఇచ్చారు. ఈ నెలలో విశాఖపట్నంలోని విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్‌లో డీఎస్‌పీ నిర్వహించాలనుకున్న మ్యూజిక్ కాన్సర్ట్‌కు పోలీసులు అనుమతి నిరాకరించారు. భద్రతా కారణాల దృష్ట్యా పర్మిషన్ ఇవ్వలేమని సీపీ శంఖబ్రత బాగ్చి చెప్పారు. కాగా, విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ వాటర్ వర్ల్డ్‌లో ఇటీవల ఓ బాలుడు మునిగి మృతిచెందాడు. ఈ ఘటన నేపథ్యంలోనే దేవీశ్రీకి అనుమతి నిరాకరించినట్లు సమాచారం. అయితే, ఈ కాన్సర్ట్‌కు సంబంధించి నిర్వాహకులు ఇప్పటికే చాలా ఏర్పాట్లు చేశారు. భారీగా ఆన్‌లైన్‌లో టికెట్లు కూడా విక్రయించారు. ఇలాంటి సమయంలో ఇప్పుడు పోలీసులు పర్మిషన్ ఇవ్వకపోవడంతో డీఎస్‌పీతో పాటు నిర్వాహకులు, షో టికెట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు.

# వన్డే క్రికెట్ ఎప్పుడూ సవాలే...



● భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ

బలగం టీవీ, హైదరాబాద్

ఇతర ఫార్మాట్లకు భిన్నంగా వన్డే క్రికెట్ ఎప్పుడూ సవాల్‌గా ఉంటుందని.. ప్రస్తుతం టీ20 క్రికెట్‌కు ప్రజాదరణ పెరుగుతున్నప్పటికీ అది అత్యంత గౌరవనీయమైన ఫార్మాట్లలో ఒకటిగా ఉందని భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ అన్నారు. రోహిత్ శర్మ ప్రస్తుత క్రీడా యుగంలో వన్డే క్రికెట్ యొక్క స్థిరత్వాన్ని సమర్థించాడు.

మాజీ ఆస్ట్రేలియా కెప్టెన్ మైఖేల్ క్లార్క్‌తో 'బియాండ్23 క్రికెట్ పాడ్‌కాస్ట్'లో మాట్లాడుతూ, రోహిత్ తమ జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ప్రచారంలో ఎదుర్కొన్న తీవ్రతను గుర్తు చేసుకున్నాడు. 50 ఓవర్ల క్రికెట్ ఎల్లప్పుడూ ఆట మరే ఇతర ఫార్మాట్‌కు లేని ప్రత్యేకమైన సవాలును అందించిందని అతను నొక్కి చెప్పాడు. ప్రస్తుత పరిస్థితుల్లో టీ20 క్రికెట్ పెరుగుతున్న ప్రజాదరణ మరియు అధిక ఫ్రీక్వెన్సీ ఉన్నప్పటికీ, వన్డే క్రికెట్ ఇప్పటికీ అత్యంత గౌరవనీయమైన ఫార్మాట్లలో ఒకటి అని రోహిత్ నొక్కి చెప్పాడు. క్రికెటర్‌గా తన ప్రారంభ సంవత్సరాల నుండి 50 ఓవర్ల ఫార్మాట్‌తో తనకున్న అనుబంధం చాలా లోతైనదని అతను వివరించాడు.

మనమందరం వన్డే ప్రపంచకప్, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ చూస్తూ పెరిగామని.. తాము అందులో ఆడామని.. ఆ మ్యాచులన్నీ ఉత్తేజకరమైనవని చెప్పాడు. అవన్నీ గతానికి సంబంధించినవని తనకు తెలుసునని.. ఎందుకంటే ఇప్పుడు జనం టీ20 క్రికెట్‌ని చూస్తున్నారని.. కానీ, వన్డే క్రికెట్‌లో సవాల్ భిన్నంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. రోహిత్ కెప్టెన్సీలో ఇటీవల భారత జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని గెలిచిన విషయం తెలిసిందే. ఈ టోర్నీలో ఐదు మ్యాచ్లల్లో కలిపి రోహిత్ 180 పరుగులు చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో 83 బంతుల్లో 76 పరుగులు చేశాడు.

### రోహిత్ శర్మకు అరుదైన గౌరవం

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మకు అరుదైన గౌరవం లభించనుంది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఒక స్టాండ్‌కు ఆయన పేరు పెట్టనున్నారు. ఈ మేరకు ముంబయి క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని ఎంసీఏ ప్రతినిధులు మంగళవారం మీడియాకు వెల్లడించారు.

ఐపీఎల్ 18వ సీజన్‌లో భాగంగా సన్ రైజర్స్‌తో జరిగే మ్యాచ్ సందర్భంగా రోహిత్ శర్మ పెవిలియన్‌ను ఆవిష్కరించే అవకాశం ఉంది. ముంబయి క్రికెట్ అసోసియేషన్ వార్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వాంఖడే స్టేడియంలోని స్టాండ్స్‌కు క్రికెట్ దిగ్గజాల పేర్లు పెట్టే అంశంపై అధికారులు చర్చించారు. భారత జట్టుకు, ముంబయి క్రికెట్‌కు విశేషమైన సేవలందించిన రోహిత్ శర్మను గౌరవించాలని భావించిన వారంతా వాంఖడేలోని ఒక స్టాండ్‌కు రోహిత్ శర్మ పేరు పెట్టాలని తీర్మానించారు. దీనికి సంబంధించిన వివరాలను ఎంసీఏ అధ్యక్షుడు అజింక్యా నాయక్ వెల్లడించారు.

## బ్యాట్ టెస్టులో నరైన్ ఫెయిల్

బలగం టీవీ, హైదరాబాద్



ఐపీఎల్ 2025లో కొత్త వివాదం ఒకటి వెలుగులోకి వచ్చింది. మంగళవారం జరిగిన మ్యాచ్ లో ఒక వివాదాస్పద సంఘటన సోషల్ మీడియాలో వైరల్ గా మారుతుంది. చండీగఢ్‌లోని కోల్‌కతా ఓపెనర్ సునీల్ నరైన్ బ్యాట్ ఐపీఎల్ రూల్స్ కు విరుద్ధంగా ఉన్నట్లు తేలింది. 112 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో కేకేఆర్ ఓపెనర్లు సునీల్ నరైన్, క్వింటన్ డి కాక్ క్రీజులోకి వచ్చారు. ఇన్నింగ్స్ ప్రారంభం కావడానికి ముందు అంపైర్ నరైన్ బ్యాట్‌ను పరిశీలించడానికి ఆటను కాసేపు నిలిపి వేశారు. అయితే ఈ టెస్టులో నరైన్ బ్యాట్ విఫలమైనట్లు అంపైర్లు తేల్చారు. సునీల్ నరైన్ బ్యాట్ ఉపయోగించిన బ్యాట్ గేజ్ పరీక్షలో విఫలమైంది. అంపైర్ సయ్యద్ ఖలీద్‌తో చర్చించిన తర్వాత, నరైన్ బ్యాట్ నిబంధనలకు అనుగుణంగా లేదని తేలింది. దీంతో అతను బ్యాట్‌ను మార్చాల్సి వచ్చింది. నరైన్ బ్యాట్ తర్వాత అంపైర్ మరో కేకేఆర్ ప్లేయర్ అంగ్‌క్రిష్ రఘువంశీ బ్యాట్‌ను చెక్ చేయగా ఆ బ్యాట్ సరిగానే ఉందని అంపైర్లు చెప్పారు. అలాగే 11 వ స్థానంలో బ్యాటింగ్ కు వచ్చిన ఫాస్ట్ బౌలర్ అన్రిచ్ నార్జే బ్యాట్ కూడా చట్టవిరుద్ధమని అంపైర్లు గుర్తించారు. బ్యాట్ సైజ్ పరిమితి దాటినట్లు గుర్తించారు. నరైన్ తరహాలోనే అతని బ్యాట్‌ను కూడా మార్పించారు.

ఐపీఎల్ రూల్స్ ప్రకారం బ్యాట్ ముందు భాగం వెడల్పు 10.79 సెం.మీ కంటే ఎక్కువ ఉండకూడదు. బ్లేడ్ 6.7 సెం.మీ కంటే మందంగా ఉండకూడదు. బ్యాట్ అంచు 4 సెం.మీకి పరిమితం చేయాలి. బ్యాట్ పొడవు 96.4 సెం.మీ ఉండాలి.

## ఫాలోవర్లంతా థియేటర్లకు రారు : పూజాహెగ్డే

బలగం టీవీ, హైదరాబాద్



కన్నడ భామ పూజా హెగ్డేకు ఆసక్తిర వ్యాఖ్యలు చేసింది. ఇన్స్టాగ్రామ్ లో తనకు 27 మిలియన్ల మంది ఫాలోయర్లు ఉన్నారని... అయితే, వారంతా తన సినిమాలు చూసేందుకు థియేటర్లకు రారని పూజా హెగ్డే వ్యాఖ్యానించింది. చాలా మంది సూపర్ స్టార్లకు 5 మిలియన్ల కంటే తక్కువ మంది ఫాలోయర్లు ఉంటారని... కానీ, వారి సినిమాలకు కోట్ల మంది వస్తుంటారని తెలిపింది. కాబట్టి ఫాలోయర్లు ఉన్నంత మాత్రాన వాళ్లంతా మన కోసం థియేటర్లకు వస్తారని కాదని చెప్పింది.